సాక్షి విజయనగరం

మంగళవారం । 10 । జనవరి । 2023



దివ్యాంగులకు ఉపకరణాలు సిద్ధం

ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న భవిత కేంద్రాల్లోని దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందించేందుకు పరికరాలను సిద్ధం చేసింది. - 8లో



కలెక్టర్ స్పందనకు 151 వినతులు

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 151 అర్జీలు అందాయి. - 8లో

ఒకే ఈతలో రెండు దూడలు



తెర్లాం: మండలంలోని కుసుమూరు గ్రామంలో డోకల శంకరరావుకు చెందిన ఆవు ఒకే ఈతలో రెండు కోడె దూడలకు సోమవారం జన్మనిచ్చింది. సాధారణంగా ఆవు ఒకే దూడకు జన్మనిస్తుంది. రెండు దూడలు జన్మించడం, ఆరోగ్యంగా ఉండడంతో వీటిని గ్రామస్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

న్యూస్‌రీల్

ఆగ్రో రైతు సేవా కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ఆగ్రో రైతు సేవా కేంద్రాల ఏర్పాటుకు డిగ్రీ, పాలిటెక్నిక్ డిప్లెమా విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏపీ ఆగ్రోస్ జిల్లా మేనేజర్ డీడీవీ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సేవా కేంద్రాల ద్వారా ఆధునిక వ్యవసాయ యంత్రాలు, యాంత్రీకరణ పనిముట్లు విక్రయించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

108 జిల్లా మేనేజర్‌గా మన్మథనాయుడు



విజయనగరం ఫోర్ట్: 108 వాహన సేవల జిల్లా మేనేజర్‌గా ఎస్.మన్మథనాయుడు నియమితులయ్యారు. ఇప్పటి వరకు మేనేజర్‌గా పనిచేసిన వెంకటరమణకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎమర్జెన్సీ టెక్నీషియన్‌గా ఉద్యోగం రావడంతో వెళ్లిపోయారు. ఆ స్థానంలో మన్మథనాయుడును అరబిందో సంస్థ నియమించింది. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 108 అంబులెన్స్ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు.

12న జిల్లాస్థాయి శాప్ లీగ్ క్రీడా పోటీలు

విజయనగరం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 12న నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్‌కోచ్ పి.అప్పలనాయుడు సోమవారం తెలిపారు. ఆ రోజు రాజీవ్ స్టేడియంలో జరిగే పోటీల్లో 21 సంవత్సరాలలోపు వయస్సుగల బాలుర క్రీడాకారులు వాలీబాల్ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అండర్-21, అండర్-17 కేటగిరీల్లో షూటింగ్‌బాల్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. బాలుర అండర్-18 విభాగంలో ఎస్.కోటలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఎంపిక పోటీల్లో అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ముందుస్తుగా ఎంట్రీఫీజు చెల్లించి పాల్గొనాలని కోరారు.

శ్రీశైల మల్లన్నకు తలపాగా

- నేతపనికి శ్రీకారం



పెనుబాకలో తలపాగా కోసం నేతపని చేపట్టిన చేనేత కార్మికులు

రాజాం సిటీ: రాజాం మండలంలోని పెనుబాక గ్రామానికి చెందిన చేనేత కార్మికులు శ్రీశైల మల్లన్న తలపాగా తయారీకి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని పెద్దవీధిలో సోమవారం నేత పనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వడ్డి పుష్పావతి మాట్లాడుతూ ఏటా శివరాత్రి నాటికి శ్రీశైల మల్లికార్జునస్వామికి తలపాగా సమర్పించడం కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోందన్నారు. దీని తయారీకి సుమారు రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనికి చేనేత కార్మికులంతా సహకరిస్తున్నారని తెలిపారు.

జనసేనతో కలిసి పోటీచేస్తాం

- బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు



సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్న ఎంపీ నరసింహారావు

గజపతినగరం రూరల్: వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో జనసేనతో కలిసి పోటీచేస్తామని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తెలిపారు. మరుపల్లి గ్రామంలోని బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేనతో కలిసి పోటీచేసే అంశంపై కేంద్ర నాయకులతో మాట్లాడటం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని, కళాశాల డైరెక్టర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టీలు కట్టి మోసపోవద్దు

విజయనగరం అర్బన్: ప్రజలు తమ కష్టార్జితంతో పొదుపు చేసుకున్న డబ్బును మదుపు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, రిజిస్టర్ అయిన సంస్థల్లో మాత్రమే మదుపు చేయాలని సూచించారు. జిల్లాలో రిజిస్టర్ అయిన సంస్థలు 44 ఉన్నాయని తెలిపారు. రిజిస్టర్ చిట్ ఫండ్ కంపెనీల్లో కట్టిన చిట్టీలకు మాత్రమే భద్రత ఉంటుందని తెలిపారు. అనధికార చిట్టీలు, పప్పుల చిట్టీలపై అప్రమత్తంగా ఉండి, ముందుగానే అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

విజయవంతంగా ప్రకృతి పంట

ప్రకృతి, సేంద్రియ సాగుకు విజయనగరం జిల్లా రైతులు మొగ్గుచూపుతున్నారు. గెత్తం, పచ్చిరొట్ట ఎరువులతో భూమిని సారవంతం చేస్తున్నారు. పంటకు కొత్త సత్తువను అందిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు, గిట్టుబాటు ధరలు అందుకుంటున్నారు. వ్యవసాయంలో 'విజయ'వంతంగా ముందుకు సాగుతున్నారు.

- సేంద్రియ సాగులో విజయనగరం జిల్లా ముందడుగు
- పది క్లస్టర్లలో 212 గ్రామాల్లో రైతుల భాగస్వామ్యం
- మూడేళ్లలో 35 వేల ఎకరాలకు పెరిగిన విస్తరణ
- వరితో పాటు చెరకు, కూరగాయల సాగు
- సేంద్రియ బెల్లానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఆర్డర్
- ఏటా జిల్లా నుంచి 186 టన్నుల బెల్లం అందజేత
- 11 ఆలయాల అవసరాలకు 24 టన్నుల ధాన్యం సరఫరా



పూసపాటిరేగ మండలం భరణికంలో 'ప్రకృతి' వరి పంటను చూపిస్తున్న వ్యవసాయ శాఖ బృందం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఆరోగ్యమే మహా భాగ్యం అనేది నానుడి... మరి ఆరోగ్యంగా ఉండాలంటే? అని ఎవరినైనా అడిగితే ఇప్పుడు వైద్యులు, పోషకాహార నిపుణులు తదితరులంతా చెప్పేది ఒకటే మాట! రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా పండించే వ్యవసాయ ఉత్పత్తుల వినియోగమే! వాటి కోసం వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆ ఆసక్తి ఎలా ఉందో గమనించడానికి, మరోవైపు సేంద్రియ సాగు చేస్తున్న రైతులను ప్రోత్సహించేందుకు కలెక్టర్ ఎ.సూర్యకుమారి గత వారం కలెక్టరేట్ స్పందన హాల్ వద్ద సేంద్రియ ఉత్పత్తుల ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయించారు. అరగంట వ్యవధిలో సుమారు రూ.16 వేల వ్యాపారం జరిగింది. అంతేకాదు టీటీడీ సహా రాష్ట్రంలో పలు ఆలయాల్లోనూ వినియోగానికి సేంద్రియ ఉత్పత్తుల వైపే మొగ్గు చూపిస్తున్నారు మరి!



సహజసిద్ధంగా రైతులు తయారుచేసిన కీటక నాశిని మందులు

ప్రకృతి సేద్యం నాలుగేళ్లలో చెప్పుకోదగిన స్థాయిలో విస్తరించింది. ప్రభుత్వం తోడ్పాటు, జిల్లా అధికారుల సహకారం ఫలితంగా జిల్లాలోని పది క్లస్టర్లలోనూ దాదాపు 35 వేల ఎకరాలకు చేరింది. సెర్ప్ గుర్తించిన 212 గ్రామాల్లో ఇప్పుడు ఆశాజనక ఫలితాలను అందిస్తోంది. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులతో చేస్తున్న వ్యవసాయం కన్నా ప్రకృతి సేద్యంతో దుష్ఫలితాలు లేకపోవడం, పెట్టుబడి తక్కువ అవుతుండటంతో రైతులు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. మరోవైపు వారికి అన్నివిధాలా ప్రభుత్వం తరఫున సహాయసహకారాలు అందించేందుకు జిల్లావ్యాప్తంగా 300 మందికి పైగా ప్రకృతి సేవకులు (ఐసీఆర్‌పీలు) అందుబాటులో ఉంటున్నారు.

దిగుబడి ఎక్కువ, పెట్టుబడి తక్కువ...

ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారుల గణాంకాల ప్రకారం సేంద్రియ సాగుతోనే పంటల్లో దిగుబడి ఎక్కువగా వస్తోంది. వరి పొలాల్లో ఇటీవల నిర్వహించిన 53 పంటకోత ప్రయోగాల్లో రుజువైంది. నవధాన్యాలతో పెరిగిన పచ్చిరొట్టను దమ్ములో కలియదున్నడం ద్వారా తయారుచేసిన ఎరువుతో పాటు ప్రకృతి వ్యవసాయ విధానాలతో ఎకరాకు 2,753.60 క్వింటాళ్లు ధాన్యం దిగుబడి వచ్చింది. పచ్చిరొట్ట ఎరువు లేకుండా కేవలం ప్రకృతి వ్యవసాయ విధానాలనే అనుసరించిన చోట ఎకరాకు 2,592 కిలోల దిగుబడి వచ్చింది. ఇక రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులను వినియోగించిన చోట 2,371.20 కిలోల దిగుబడి మాత్రమే వచ్చింది. ఇక పెట్టుబడి విషయానికొస్తే ఎకరాకు సగటున రూ.12 వేల వరకూ ఖర్చు అయ్యింది. అదే సేంద్రియ సాగుకు రూ.8 వేల నుంచి రూ.9 వేల వరకూ మాత్రమే ఖర్చు అయ్యిందని రైతులే చెబుతున్నారు.

నేల సారం పెరుగుతుంది

మోతాదుకు మించి రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించడం వల్ల ఇటు భూమి సారంపైన, అటు మనుషులు ఆరోగ్యంపైనా ప్రభావం పడుతోందనే ఆందోళనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సేంద్రియ సాగు మేలు. నేల సారం పెరుగుతుంది. వానపాముల వంటి పంటలకు మేలు చేసే జీవరాశులు వృద్ధి చెందుతాయి.

– ఆనందరావు, ఉప సంచాలకులు, ప్రకృతి వ్యవసాయ విభాగం



వైఎస్సార్ రైతుభరోసా కేంద్రం వద్ద ప్రకృతి సేద్య విధానాలను తెలుసుకుంటున్న రైతులు



ప్రకృతి సేద్యం చేసిన భూమిలో ఇబ్బడిముబ్బడిగా వృద్ధి చెందిన వానపాములు

రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం...



ప్రతి ఒక్కరూ ఆరోగ్య, పోషకాహార భద్రతను పొందే విధంగా నాబార్డు, భారత చిరుధాన్యాల సమాఖ్య సహకారంతో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పంట వేయక ముందు, వేసిన తర్వాత అనుసరించే సేంద్రీయ సేద్య విధానాలపై రైతులకు వివరిస్తున్నాం. మార్కెటింగ్ సదుపాయాలపై అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందించుకున్నాం. ప్రకృతి సేవకుల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు చైతన్య సదస్సులు నిర్వహించి చిరుధాన్యాల వినియోగంపై, తద్వారా కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

– ఉషారాణి, సబల స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు

ప్రభుత్వం, యంత్రాంగం సహకారం...



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా నిలుస్తోంది. సేంద్రియ విధానంలో పండిన పంటలకు సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నాం. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతు నుంచి పంటను విధిగా కొనుగోలు చేసే విధంగా మార్క్ ఫెడ్ సహాయంతో తగిన చర్యలు తీసుకుంటున్నాం. దానిలో భాగంగానే తిరుమలకు, ఇతర ఆలయాలకు ఇక్కడ నుంచి ఎగుమతులు చేస్తున్నాం. సేంద్రియ విధానంలో సాగు చేసిన రైతులకు మిగిలిన వారి కంటే 10 శాతం అధికంగా మార్కెట్ ధర కల్పిస్తున్నాం. రైతు భరోసా కేంద్రానికి అనుసంధానంగా బ్లాక్‌లను ఏర్పాటు చేసి మార్కెటింగ్ వసతి కల్పిస్తూ రైతులకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నాం.

– ఎ.సూర్యకుమారి, కలెక్టర్, విజయనగరం

ప్రారంభంలో నష్టమొచ్చినా...



నేను మూడు ఎకరాల భూమిలో 35 రకాల వరి సాగు చేస్తున్నాను. మరో రెండు ఎకరాల భూమిలో మామిడి తోటలు ఉన్నాయి. సేంద్రియ సేద్య విధానాలను అనుసరించడం వల్ల ప్రారంభంలో నష్టాలు వచ్చాయి. వెనకడుగు వేయలేదు. మూడేళ్ల తర్వాత నుంచి లాభాలు అందుకుంటున్నాను. ఇప్పుడు ఎకరాకు 28 బస్తాల ధాన్యం దిగుబడి వస్తోంది.

– దార్లపూడి రవి, గుర్లపాడు, రేగిడి ఆముదాలవలస

ఆరోగ్య సమస్యలు ఉండవు



నేను నాలుగు ఎకరాల్లో పూర్తిగా సేంద్రియ విధానాల్లో పాతకాలం నాటి ఒడిశా భాస్మతి, కుంకుమ సాల్, కాలాబట్టీ, కశ్మీరీసాల్, నవారా వరి రకాలను సాగు చేస్తున్నాను. ఈ బియ్యానికి వినియోగదారుల్లో డిమాండ్ పెరుగుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ప్రస్తుతం చాలామంది రైతులు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులతో పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు బీపీ, రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. అదే సేంద్రియ విధానాల్లో పండించిన పంటలతో ఆరోగ్య సమస్యలు ఉండవు.

– పోతినిండి అనంతకుమార్, రైతు, పూసపాటిరేగ

వేంకటేశ్వరుడికి 'సేంద్రియ' బెల్లం...

వరి, కూరగాయల సాగులోనే గాకుండా చెరకు సాగులోనూ జిల్లాలో కొంతమంది రైతులు సేంద్రియ పద్ధతులనే అనుసరిస్తున్నారు. ఆ చెరకు రసంతో తయారు చేసిన బెల్లానికి మంచి డిమాండ్ ఉంటోంది. అలాంటి 186 టన్నుల బెల్లం తిరుమల తిరుపతి దేవస్థానానికి ఏటా జిల్లా నుంచి వెళ్తోంది. రాష్ట్రంలోని మరో 11 ఆలయాల్లోనూ వివిధ అవసరాల కోసం సేంద్రియ విధానాల్లో పండిన 24 టన్నుల ధాన్యం మన రైతులు పంపిస్తున్నారు.

అరగంటలోనే రూ.16 వేల వ్యాపారం...

సేంద్రియ పంటల వైపు రైతులను ప్రోత్సహించే క్రమంలో కలెక్టర్ ఎ.సూర్యకుమారి ముందున్నారు. ఆమె చొరవతో రైతులు కలెక్టరేట్ స్పందన హాల్ సమీపంలో వారం సేంద్రియ ఉత్పత్తుల ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. సరకులన్నీ అరగంటలోనే అమ్ముడైపోయాయి. సుమారు రూ.16 వేల వ్యాపారం జరిగింది. సేంద్రియ ఉత్పత్తులపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతుందనేందుకు ఇదే నిదర్శనం.

కెమిస్ట్, ప్రొడక్షన్ కోర్సుకు శిక్షణ

విజయనగరం రూరల్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని అర్హులైన అభ్యర్థులకు రీడాక్స్ లేబొరేటరీ సహకారంతో స్కిల్ కాలేజీలో శిక్షణ అందిస్తామని ఏపీఎస్ఎస్ డీసీ జిల్లా అధికారి నీలం గోవిందరావు సోమవారం తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 18-24 ఏళ్ల లోపు అభ్యర్థులకు వీటిఅగ్రహారం సమీపంలోని టీటీడీసీలో 4 నెలల పాటు శిక్షణ అందిస్తామని, అనంతరం ఫార్మా కంపెనీలో ఉపాధి కల్పిస్తామని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 18న ఉదయం 9 గంటలకు టీటీడీసీ మహిళా ప్రాంగణంలో బయోడేటా, ఆధార్ కార్డ్, విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు సెల్: 85558 32416, 94929 27844, 99888 53335 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించి మంగళవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి బి.శాంతకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీన బొబ్బిలి డివిజన్‌కు సంబంధించి గ్రోత్ సెంటర్‌లో ఉన్న ఆర్‌డీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు, 12న చీపురుపల్లి డివిజన్ పరిధిలో ఉన్న అభ్యర్థులకు చీపురుపల్లిలో ఉన్న సీడీపీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు, విజయనగరం డివిజన్ పరిధిలో ఉన్న వారికి ఆర్డీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అమ్మ తరలివచ్చిన వేళ..

- పులకించిన భక్తజనం
- శంబర చేరుకున్న పోలమాంబ



పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పోలమాంబ అమ్మవారు శంబర గ్రామానికి తరలివచ్చిన వేళ.. భక్తిభావం ఉప్పొంగింది. అమ్మవారి ఘటాలను చూసిన భక్తులు పులకించిపోయారు. ఘటాలకు ఎదురెళ్లి పసుపుకుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలు, తప్పెటగుళ్లు, మహిళల కోలాటాలతో అమ్మవారిని సోమవారం రాత్రి గ్రామంలోకి ఆహ్వానించారు. ఏటా జనవరి నెలలో జరగనున్న జాతరకు గ్రామస్తులు ఇప్పటికే సిద్ధంకాగా, అమ్మవారు గ్రామానికి చేరుకోవడంతో జాతరశోభ సంతరించుకుంది. గోముఖీనది ఆవలి ఒడ్డున ఉన్న అమ్మ వారి గద్దెవద్ద పూజారి, కుప్పిల, గిరడ, మున్సిబ్ కుటుంబాల వారు, గ్రామపెద్దలు అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఘటాలను గ్రామంలోకి తీసుకువచ్చారు. అమ్మవారికి మంగళవారం కాళ్లనొప్పులు కారణంగా గ్రామంలోని చదురుగుడిలో విశ్రాంతి తీసుకుని, బుధవారం నుంచి 14 రోజుల పాటు అమ్మవారు ఆలయంలో కొలువై పూజలందుకుంటారు. ప్రతి రోజు సాయంత్రం నుంచి రాత్రి వరకు అమ్మవారి ఘటాలను గ్రామంలోని అన్నివీధుల్లో తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం ఈనెల 23న తొలేళ్ల ఉత్సవం, 24న సిరిమానోత్సవం, 25న అనుపోత్సవం నిర్వహించి, ఈనెల 31న మారు జాతర నిర్వహిస్తారు. ఇలా 10 వారాల పాటు అమ్మ వారి జాతర సాగుతుంది. సంక్రాంతి పండగకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అమ్మవారిని దర్శించుకుంటారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, ఈఓ వి.రాధా కృష్ణ, ట్రస్టుబోర్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యుడు, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ, రెవిన్నాయుడు, గ్రామపెద్దలు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామంలోకి అమ్మవారి ఘటాలను తీసుకువస్తున్న పూజారులు, గ్రామపెద్దలు

చురుగ్గా వైద్య కళాశాలల నిర్మాణం

- రాష్ట్రవ్యాప్తంగా 17 వైద్య కళాశాలల ఏర్పాటు
- ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు, సర్వజన ఆస్పత్రి పరిశీలన
- వైద్యసేవలపై ఆరా తీసిన వైద్య శాఖ మంత్రి విడదల రజని



గాజులరేగ వద్ద గల ప్రభుత్వ వైద్యకళాశాల పనులను పరిశీలిస్తున్న మంత్రి విడదల రజని, ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం/విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఒకే దఫాలో 17 ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రారంభించాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని చెప్పారు. వాటిలో విజయనగరం సహా ఐదు వైద్య కళాశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. విజయనగరం జిల్లా పర్యటనకు సోమవారం వచ్చిన ఆమె గాజులరేగ వద్ద నిర్మాణంలోనున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవనాలను పరిశీలించారు. అనంతరం సర్వజన ఆస్పత్రిని సందర్శించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అక్కడ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఆస్పత్రిలో అభివృద్ధి చేసిన ఓపీ సెంట్రల్ రిజిస్ట్రేషన్ కౌంటర్, సెమినార్ హాల్, ఐసీయూలను పరిశీలించారు. ఆస్పత్రి ఆధునీకరణపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్‌లో రోగుల పేర్లు నమోదు రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటుచేసిన అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌ను, మహిళల మెడికల్ వార్డును పరిశీలించారు. రోగులను ఆప్యాయంగా పలకరిస్తూ, ఆరోగ్యంపై ఆరా తీశారు. సేవల తీరును తెలుసుకున్నారు. కళాశాల నిర్మాణం, తరగతుల నిర్వహణ ఏర్పాట్లను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య వివరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. విజయనగరంలో రూ.500 కోట్ల వ్యయంతో తలపెట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. సర్వజన ఆస్పత్రివద్ద నిర్మించిన తాత్కాలిక భవనాల్లో 2023–24 విద్యా సంవత్సరం నుంచే వైద్య కళాశాల తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. తద్వారా 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆమె వెంట వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.కృష్ణబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ డి.మురళీధర్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ డాక్టర్ వినోద్‌కుమార్, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ప్రిన్సిపాల్ పద్మలత, వైద్యాధికారులు ఎస్.అప్పలనాయుడు, ఎస్.వి.రమణకుమారి, గౌరీశంకర్, ఆర్డీఓ సూర్యకళ ఉన్నారు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మహిళా వార్డులో అవ్వతో మాట్లాడుతున్న మంత్రి రజని



వార్డులో పర్యటిస్తున్న మంత్రి రజని

క్లుప్తంగా

గిరిజనులకు ఉచిత శిక్షణ ఇవ్వాలి

పార్వతీపురం: గిరిజన నిరుద్యోగులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వాలని గిరిజన విద్యార్థి నాయకులు పి.సురేష్, డి.సీతారాం, కె.గౌరమ్మ తదితరులు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్‌ను సోమవారం కోరారు. జిల్లాలో డిగ్రీ నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగులకు వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని వినతిపత్రం అంజేశారు.

రైలుఢీకొని వ్యక్తి మృతి



ఘటనాస్థలంలో సూర్యనారాయణ మృతదేహం

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జవలస వద్ద రైలుఢీకొని సీహెచ్ బొడ్డవలస గ్రామానికి చెందిన కునుకు సూర్యనారాయణ(42) సోమవారం మృతిచెందాడు. రైల్వే హెచ్‌సీ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయం చేస్తూ, పశువుల వ్యాపారం చేసే సూర్యనారాయణ పశువులు కొనడానికి ఎం.బూర్జవలస వచ్చి రైలు పట్టాలు దాటుతుండగా మృతిచెందాడు. సూర్యనారాయణ మృతదేహాన్ని బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మంగమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బొలెరో ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన కనకరాజు

కొత్తవలస రూరల్: మండలంలోని చీపురువలస గ్రామానికి చెందిన కనక సూర్యసుబ్రహ్మణ్యం రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం చీపురువలస గ్రామానికి చెందిన సూర్యకనకరాజు (52) కొత్తవలసలో పెయింట్లు తీసుకుని గ్రామానికి వెళ్తుండగా రాజపాత్రునిపాలెం వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో ఢీకొట్టడంతో కింద పడి గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కనకరాజు సోదరుడు సీతారామ విజయ వరాహ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్సై బి.దేవి కేసు నమోదు చేశారు. ఏఎస్సై జనార్దన కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్, ఆటో ఢీ : ఇద్దరికి గాయాలు

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి కూడలి వద్ద సోమవారం ఆటో, బైక్ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయని గజపతినగరం ఎస్సై గంగరాజు తెలిపారు. ఈ మేరకు విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎం.గుమడాం నుంచి ద్విచక్రవాహనంపై కూర్మెళ్ల సూర్యనారాయణ (విశ్రాంత వీఆర్వో) తన మిత్రుడు అప్పారావుతో కలిసి గజపతినగరం వస్తుండగా మరుపల్లి కూడలి వద్దకు వచ్చేసరికి గజపతినగరం నుంచి గుమడాం వస్తున్న ఆటో ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరూ కింద పడిపోవడంతో గాయాలయ్యాయని తెలిపారు. గాయాలపాలైన వారిని విజయనగరంలోని ఎంఆర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు చెప్పారు.

పేకాట రాయుళ్ల అరెస్టు



పేకాటరాయుళ్లతో పోలీసులు

గంట్యాడ: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సోమవారం సాయంత్రం పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.1130 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాలు సిద్ధం

- రూ.28లక్షలతో సిద్ధం చేసిన సమగ్రశిక్ష–విద్యాశాఖ
- ఉమ్మడి జిల్లాలో 481 మంది విద్యార్థులకు లబ్ధి
- రెండు రోజుల్లో పంపిణీ చేయనున్న అధికారులు



జిల్లా కేంద్రం నుంచి మండలాలకు తరలిస్తున్న ఉపకరణాలు

విజయనగరం పూల్‌బాగ్: ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న భవిత కేంద్రాల్లోని దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందించేందుకు పరికరాలను సిద్ధం చేసింది. ఈ మేరకు వాటిని ఇప్పటికే ఆయా మండల కేంద్రాలను సరఫరా చేస్తోంది. మండల శాఖ వారు ఉపకరణాలను రెండురోజుల్లో లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

ఉమ్మడి జిల్లాలో వైద్య శిబిరాలు

సమగ్రశిక్ష–విద్యాశాఖ ఆధ్వర్యంలో 2020–21 విద్యా సంవత్సరంలో దివ్యాంగులకు ఉపకరణాల కోసం వైద్య నిర్ధారణ శిబిరాలను ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. నిర్ధారణ పరీక్షలకు సుమారు 850 మంది 6 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగులు హాజరు కాగా, వారిలో వివిధ రకాల ఉపకరణాలకు 481 మందిని అర్హులుగా వైద్యులు నిర్ధారించారు. పరీక్షల్లో అర్హులైన దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు ఇటీవల జిల్లాకు చేరుకున్నాయి. అవి మండలాల్లో గల భవిత కేంద్రాలకు చేరుతున్నాయి. ఈ ఉపకరణాల పంపిణీని మండల స్థాయిలో నిర్వహించి ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో అర్హులైన అభ్యర్థులకు అందజేయనున్నారు. జిల్లాకు చేరిన సుమారు రూ.28 లక్షల విలువైన ఉపకరణాలలో ట్రైసైకిల్స్, వీల్‌చైర్లు, సీపీ వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, రొలేటర్లు, క్లచర్స్‌ఎల్బోలు పంపిణీ చేయనున్నారు.

రెండు రోజుల్లో పంపిణీ



ఉమ్మడి జిల్లాలో వైద్య నిర్ధారణ శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాం. ఈ పరీక్షల్లో 481 మందిని అర్హులుగా వైద్యులు నిర్ధారించారు. ఆయా ఉపకరణాలను రెండు రోజుల్లో లబ్ధిదారులకు అందజేస్తాం.

–డాక్టర్ వీఏ.స్వామినాయుడు, ఏపీసీ, సమగ్రశిక్ష, విజయనగరం

స్పందనలోనే పరిష్కారం

- చొరవ తీసుకున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వచ్చిన స్వయం సంఘాల మహిళలు..బత్తిలి గ్రామీణ వికాస్ బ్యాంకులో గల తమ సంఘాల అకౌంట్లను బ్లాక్ చేశారని కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ నిషాంత్ కుమార్ వెంటనే లీడ్ బ్యాంకు మేనేజరు జె.ఎల్.ఎస్.మూర్తితో మాట్లాడి బ్యాంకు అకౌంట్లను వెంటనే పునరుద్ధరించేలా చేశారు. స్పందనలో వచ్చిన అర్జీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్‌లతో కలిసి ప్రజలనుంచి 119 అర్జీలు స్వీకరించారు.

స్పందనపై సమీక్ష

స్పందన కార్యక్రమం అనంతరం కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందనలో వచ్చిన దరఖాస్తులను యాప్‌లో పరిశీలించగా 31 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, 68 అర్జీలు అధికారులు ఇంకా అధికారులు చూడలేదని, అర్జీలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప అధికారులు సెలవుపై వెళ్లినపుడు ముందస్తు అనుమతి తీసుకోవాలని, సెలవు సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, సమావేశాల వివరాలను తెలియజేయాలని తెలిపారు. స్పందన కార్యక్రమం అనంతరం పాలకొండ మండలం కొండాపురానికి చెందిన నల్లబారికి చంద్రశేఖర్‌కు విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన ల్యాప్‌టాప్‌ను కలెక్టర్ నిషాంత్ కుమార్ అందజేశారు.

ప్రజాసంకల్ప యాత్రతో ప్రజల స్థితిగతుల్లో మార్పు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

- విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

కొత్తవలస: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గతంలో చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఆంధ్ర రాష్ట్ర రూపురేఖలు, ప్రజల స్థితిగతులను మార్చిందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడు ఎంవీవీ.సత్యనారాయణ అన్నారు. ఆయన కుమారుడి వివాహ శుభలేఖను ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు ఎస్.కోటలో సోమవారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నాలుగు సంవత్సరాల క్రితం ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్పయాత్ర చరిత్ర సృష్టించిందన్నారు. యాత్రలో భాగంగా ప్రతి సామాజిక వర్గం సమస్యను తెలుసుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరించారని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను 98 శాతానికి పైగా నెరవేర్చి ప్రజల గుండెల్లో పదిలమైన స్థానం సంపాదించారని ప్రశంసించారు. ఇదే సంకల్పంతో రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ సీట్లు గెలిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటి నుంచే సచివాలయం పరిధిలో కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ క్యాడర్ సమన్వయంతో ఎన్నికల ప్రక్రియలో సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

అన్ని రంగాల్లో పురోగతి

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ఆనాడు దృఢమైన సంకల్పంతో చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రతో ప్రజల అభిమానం సొంత చేసుకున్నారన్నారు. అన్ని రంగాల్లో పురోగతి సాధించి దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిలిచారన్నారు. కరోనా సమయంలో క్లిష్టపరిస్థితులు ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం ముఖాల్లో చిరునవ్వులు నింపుతూ పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తవలస, వేపాడ మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, ముమ్మలూరి జగనాథం, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మెరపుల సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీఎల్‌ఓపై సస్పెన్షన్ వేటు

విజయనగరం అర్బన్: విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిన వార్డు అడ్మినిస్ట్రేటివ్‌పై కలెక్టర్ ఎ.సూర్యకుమారి సోమవారం సస్పెన్షన్ వేటు వేశారు. విజయనగరం కార్పొరేషన్‌లోని 40వ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ పాదిలావు కనకరాజుపై సస్పెన్షన్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నిక

విజయనగరం పూల్‌బాగ్: ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) విజయనగరం జిల్లా కమిటీ 2023 – 25 నూతన కమిటీ ఎన్నిక భాగస్వామ్య సంఘాల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర పరిశీలకుడిగా గణపతిరావు హాజరయ్యారు. కమిటీ చైర్మన్‌గా బి. మహేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా సీహెచ్ వెంకటరమణ, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలుగా జె.రమేష్ చంద్రపట్నాయక్, డి.శ్యామ్, పి.శ్రీనివాస్, కార్యదర్శిగా వేణుగోపాలరావు, కార్యవర్గ సభ్యులుగా ఈశ్వరరావు, వై.అప్పారావు, షేక్. బుకారి బాబు, డి.ఈశ్వరరావు, టి.సన్యాసిరాజు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సెంచూరియన్‌ను సందర్శించిన చల్లా



సెంచూరియన్ వీసీ జీఎస్ఎన్ రాజును సన్మానిస్తున్న చల్లా రామకృష్ణ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని ఆంధ్ర విశ్వ విద్యాలయం గాంధీయన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీలో ఏఆర్‌వీఆర్, అనాటమీ, రేడియాలజీ, తదితర ప్రయోగశాలలను పరిశీలించి వర్సిటీ ప్రతినిధులను అభినందించారు. అనంతరం వీసీ జీఎస్ఎన్ రాజును సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళం

విజయనగరం రూరల్: మాజీ సైనికుల సంక్షేమానికి, సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి పూసపాటిరేగ మండలంలోని హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ ఉద్యోగులు సోమవారం విరాళం అందించారు. ఉద్యోగుల తరపున హెచ్‌ఆర్ మేనేజర్ సురేష్‌కుమార్ జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయానికి విచ్చేసి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావుకు 40,200 రూపాయల విలువైన చెక్ అందజేశారు.

26 నుంచి కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాలు



మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ రాకేష్ రెడ్డి

శృంగవరపుకోట: ఈ నెల 26వ తేదీ నుంచి కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఏపీసీసీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ పి.రాకేష్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు సోమవారం స్థానిక సుబ్బిరామిరెడ్డి కల్యాణ మంటపంలో కాంగ్రెస్ నేతలతో సమావేశమైన ఆయన ముందుగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత జాతీయ కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీ చేస్తున్న భారత్ జోడో యాత్ర ఈనెల 26న ముగుస్తున్న సందర్భంగా ఆ యాత్రకు కొనసాగింపుగా ప్రతి నియోజకవర్గంలో పాదయాత్ర చేయాలని పార్టీ నిర్ణయించిందని చెప్పారు. 'చేయి చేయి కలుపుదాం' అన్న నినాదంతో రెండు, మూడు నెలల పాటు పాదయాత్రలు చేసి, ప్రజలకు కాంగ్రెస్ విధానాలను వివరిస్తామన్నారు. నాడు రాష్ట్ర విభజన వేళ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ప్రత్యేక హోదా, ప్రత్యేక నిధులు వంటి అంశాలను బీజేపీ తుంగలో తొక్కిన తీరు వివరిస్తూ కాంగ్రెస్ నేతలు ప్రతి గడపకు వెళ్లాలన్నది పార్టీ నిర్ణయమని చెప్పారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు ఆస్తులు అమ్మేస్తూ, అభివృద్ధి, సంక్షేమం అంటున్నాయని, 72 ఏళ్ల కాంగ్రెస్ ఇలానే పాలిస్తే ఈ రోజు దేశం పరిస్థితి ఏమయ్యేదని ప్రశ్నించారు. అభివృద్ధి, ఆర్థిక ఎదుగుదల, సంక్షేమం అన్న మూడు సూత్రాల ఆధారంగా కాంగ్రెస్ దేశాన్ని పాలించిందన్నారు. పెరిగిన ధరలు, కుంటుబడిన అభివృద్ధి, స్థానిక అవసరాలు వంటివే తమ పోరాట అజెండా అని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు ఎస్.రమేష్‌కుమార్, పడాల మణిబాబు, హనుమాలశెట్టి నానాజీ, పాత్రో తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య ద్వారా భోగి పిడకల విక్రయాలు



భోగి పిడకల తయారీని పరిశీలిస్తున్న ఏపీఎం హేమలత

రాజాం: మండల మహిళా సమాఖ్య ద్వారా ఈ పండగకు అవసరమైన భోగి పిడకలు, నలుగుపిండి, నువ్వులనూనెను విక్రయిస్తున్నట్లు ఎఫ్‌పీఓ ఏపీఎం కె.హేమలత తెలిపారు. సోమవారం మండలంలోని రాజయ్యపేట గ్రామంలో పలువురు మహిళా సంఘాల సభ్యుల ద్వారా ఆవుపేడ, వేపాకు కర్పూరంతో తయారు చేసిన పిడకలను ఆమె పరిశీలించారు. వీటితో పాటు ఎటువంటి రసాయనాలు కలవని నలుగుపిండి, నువ్వుల నూనెను కూడా సభ్యులతో తయారు చేయిస్తున్నామన్నారు. వీటన్నింటినీ రాజాంలోని మండల మహిళా సమాఖ్య ద్వారా విక్రయించనున్నట్లు వెల్లడించారు. తక్కువ ధరకు లభ్యమయ్యే ఈ సామగ్రి కావాలంటే రాజాంలోని వెలుగు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్.ఎమ్.ఎస్. అధ్యక్షుడు సామంతుల అరుణకుమారి, కార్యదర్శి ఆబోతుల గౌరీశ్వరి, కోశాధికారి ఆల్తి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ స్పందనకు 151 వినతులు

- అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాలు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, డీఆర్ఓ గణపతిరావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 151 అర్జీలు అందాయి. వాటిలో అత్యధికంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి 77 ఉన్నాయి. మిగిలిన వాటిలో డీఆర్‌డీఏ, వైద్యశాఖ, హౌసింగ్, మున్సిపల్ శాఖకు చెందిన వినతులు ఉన్నాయి. కలెక్టర్ ఎ.సూర్యకుమారి, డీఆర్ఓ ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మావతి, సూర్యనారాయణ, దొర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో అందిన వినతులు పెండింగ్‌లో ఉంచకుండా గడువులోగా పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు.

ఆర్మీలో ఉద్యోగాలిప్పిస్తామని టోకరా

ఆర్మీలో ఉద్యోగావకాశం కల్పిస్తామంటూ వేశాల కుమారస్వామి అనే వ్యక్తి ఒక్కొక్కరి దగ్గర రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు సొమ్ము వసూలు చేసి పరారైనట్లు డీవైఎఫ్ఐ ప్రతినిధులు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రక్ష డిఫెన్స్ అకాడమీ అనే సంస్థ పేరుతో 160 మందితో ర్యాలీ నిర్వహించి, ర్యాలీలో ఎంపికైన వారికి ఉచిత కోచింగ్ అని చెప్పి జాయిన్ చేసుకున్నారని, తర్వాత ఉద్యోగం కోసం డబ్బులు దండుకుని అకాడమీని మూసివేసి పారిపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు దండుకున్నప్పుడు కుమార స్వామి, వరంగల్ అని అడ్రస్ ఇచ్చాడని, ఆయనపై క్రిమినల్ కేసు పెట్టి, డబ్బులు అందేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఆ ఫిర్యాదును పోలీస్ శాఖకు కలెక్టర్ సూర్యకుమారి ఎండార్స్ చేసి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం

విజయనగరం క్రైమ్: స్పందన ఫిర్యాదుదారులకు సత్వర న్యాయమందించాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదులను పరిష్కరించేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. స్పందనలో భాగంగా 24 ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ, ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు సీహెచ్.రుద్రశేఖర్, జి.రాంబాబు, ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషిచేయాలి

- వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణను ప్రారంభించిన డీఈఓ లింగేశ్వరరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం: జిల్లా క్రీడారంగం అభివృద్ధిలో వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు కీలకపాత్ర పోషించాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని గురజాడ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఖేలో ఇండియా వెబ్‌సైట్‌లో క్రీడాకారుల వివరాలు నమోదులో లోపాలు లేకుండా చూడాలన్నారు. ప్రతి క్రీడాకారిని వివరాలు నమోదు చేయాలని సూచించారు. క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్‌కు గట్టి పునాది వేయాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఉదయం బొబ్బిలి, రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాలు, మధ్యాహ్నం విజయనగరం, నెల్లిమర్ల, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాలోన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎల్.వి.రమణ అధ్యక్షతన జరిగిన శిక్షణలో 270 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువజనోత్సవానికి ఎంఆర్ కళాశాల విద్యార్థులు



ఎంపికైన వలంటీర్లతో కళాశాల ప్రిన్సిపాల్, పీఓలు

విజయనగరం అర్బన్: స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకొని కర్ణాటక రాష్ట్రం ధార్వాడాలో ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయ యువజన ఉత్సవానికి స్థానిక మహారాజా (ఎంఆర్) అటానమస్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్న ఉత్సవాలకు దేశవ్యాప్తంగా 7,500 మంది వరకు హాజరవుతారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 45 మంది వలంటీర్లు ఎంపికై నట్టు పేర్కొన్నారు. యువజనోత్సవాలకు ఎంపికై న ఎస్.వసంత ఉదయ్‌కుమార్, సీహెచ్.సూర్యప్రకాష్, ఎస్.సాయి కిరణ్, కె.గోవింద్‌ను కళాశాల ప్రాంగణంలో జిల్లా ఎన్ఎస్ఎస్ పీఓలు జి.చంద్రశేఖర్, ఎం.శ్రీకాంత్, డాక్టర్ పీఎస్‌బీశర్మ, చిన్నంనాయుడు తదితరులు అభినందించారు.

డాగ్ హ్యాండ్లర్‌కు అభినందనలు



డాగ్ హ్యాండ్లర్ భరత్‌ను అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: మంగళగిరిలో ఇటీవల ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కెనైన్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణలో విజయనగరం జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు విభాగానికి చెందిన వై.భరత్‌కుమార్ ప్రతిభ చూపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఎం.దీపిక ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. గత ఏడాది డిసెంబర్ 7 నుంచి 23 వరకూ ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ విభాగంలో పోలీస్‌డాగ్స్‌కు అవసరమైన ప్రథమ చికిత్స, వివిధ శాంపిల్స్ కలెక్షన్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇందులో డాగ్ హ్యాండలర్ వై.భరత్‌కుమార్ మంచి ప్రతిభ కనబర్చారు. అనంతరం, శిక్షణ ముగింపు సమయంలో నిర్వహించిన పరీక్షలో ప్రథమస్థానంలో నిలిచారు. పోలీస్ డాగ్ రూబీ గతంలో రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో దాచిపెట్టిన ఎక్స్‌ప్లోజివ్‌ను కనిపెట్టడంలో మంచి ప్రతిభ కనబర్చి తృతీయస్థానంలో నిలిచింది. ఆర్మ్‌డ్‌రిజర్వు ఏఎస్పీ ఎం.ఎం.సోల్మన్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఇతర పోలీస్ అధికారులు భరత్‌ను అభినందించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230